## క్లుప్తంగా

### చెత్త సేకరణ కేంద్రం పరిశీలన

**నింద్ర:** మండలంలోని శ్రీరామాపురం గ్రామ పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, పంచాయతీల విస్తరణాధికారి లక్ష్మీపతి పరిశీలించారు. ప్రతి పంచాయతీలో చెత్త సేకరణ కేంద్రాలపై దృష్టి సారించి, సంపద సృష్టికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

### పారిశుధ్యం మెరుగు



నింద్రలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

**నింద్ర:** నింద్ర గ్రామ పంచాయతీలో తాగు నీరు లీకేజీ పనులకు బుధవారం మరమ్మతులు చేశారు. అలాగే పారిశుధ్యం మెరుగు పరిచారు. గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు ఆదేశించడంతో సర్పంచ్ బాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధరణి మరమ్మతులు పనులు చేయించారు.

### పాఠశాల తనిఖీ

**నింద్ర:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు టీచర్లు చెప్పే పాఠ్యాంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు సబ్జెక్ట్ టీచర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ రాజు అన్నారు. బుధవారం మండలంలోని కావునూరు పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై సామర్థ్యాలు ఎలా ఉన్నాయో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని ఆదేశించారు.

### మైనారిటీలకు సబ్సిడీ రుణాలు

**కార్వేటినగరం:** మైనారిటీ కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళి కోరారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మైనారిటీలు (ముస్లిం, సిక్కు, బుద్ధిస్టు, జైన్) కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన అర్హులైన వారు తాము ఏ కార్పొరేషన్ పరిధిలోకి వస్తామో తెలుసుకుని ఆన్‌లైన్‌లో సంబంధిత ఆధారాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వార్షికాదాయం రూ.1.50 లక్షలకు మించరాదని, వయస్సు 21 నుంచి 55 లోపు ఉండాలని తెలిపారు.

### ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



కరుణాకరన్ (ఫైల్)

**నగరి:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. వివరాలు..ఏకాంబరకుప్పంకు చెందిన ఎస్‌ఎస్. కరుణాకరన్ (24) మంగళవారం వేకువజామున పళ్లిపట్టు రోడ్డు రాజేశ్వరి థియేటర్ సమీపం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం బంధువులు తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మరణించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. మృతదేహానికి నగరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

### విద్యుత్ గ్రీవెన్స్‌కు ఆరు సమస్యలు



మాట్లాడుతున్న ఈఈ మునిచంద్ర

**చిత్తూరు కార్పొరేషన్:** స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల వినియోగదారులు సమస్యలు తెలియజేశారు. మొత్తం 6 ఫిర్యాదులు అందాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. వీటిలో ఐరాల సెక్షన్ పరిధిలో మీటర్ పేరు మార్పు చేయాలని, చిత్తూరు రూరల్‌లో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరొకటి ఇవ్వాలని ఇద్దరు కోరారని, అలాగే చిత్తూరు రూరల్‌లో లైన్ మార్చాలని, రివిజన్ బిల్లు సమస్యలు రెండు వచ్చాయని చెప్పారు. సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఐసీఎల్‌లో మాక్ డ్రిల్

**యాదమరి (కాణిపాకం):** అనుకోని విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ముందుంటుందని జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ అన్నారు. యాదమరి మండలంలోని ఐటీసీఎల్‌లో బుధవారం ఆ దళ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులు జరిగినప్పుడు ఎలా స్పందించాలో ప్రదర్శనపూర్వకంగా అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం.. అస్తవ్యస్తం

పాలసముద్రం మండలంలోని గంగమాంబపురం పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఏ గ్రామం చూసినా చెత్తాచెదారాలు, మురుగునీటి నిల్వతో దుర్గంధం చిమ్ముతున్నాయి. సమస్యలు తాండవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణులు మండిపడుతున్నారు.

- గంగమాంబపురంలో పడకేసిన పారిశుధ్యం
- మురుగునీటి నిల్వతో దుర్గంధం చిమ్ముతున్న వీధులు
- దోమల స్వైర విహారం
- పట్టించుకోని అధికారులు

ఓ వీధిని చూస్తే ఇలా..



**పాలసముద్రం:** మండలంలోని గంగమాంబపురం పంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా ఆది ఆంధ్రవాడలో పరిస్థితి అధ్వానంగా ఉంది. చేతిపంపు వద్ద ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉంటోంది. ఇక వీధులు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాస కేంద్రాలయ్యాయి. ఫలితంగా దోమల మోతతో రోగాల బారిన పడుతున్నట్టు ప్రజలు వాపోతున్నారు. మరోవైపు మురుగు వల్ల ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారుల దృష్టికి సమస్యలు నివేదించినా పట్టించుకోవడం లేదని, తమ గ్రామాలకు ఏ అధికారీ వచ్చిన పాపానపోలేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. దళితవాడలో మురుగు నీటి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, దుర్గంధం చిమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న చేతిపంపు ప్రాంతం



గంగమాంబపురం వీధుల్లో మురుగునీరు

### ఇంటెలెక్చువల్ ఫోరం విభాగం అధ్యక్షుడిగా ఎరుకలయ్య

**విజయపురం :** నగరి నియోజకవర్గ ఇంటెలెక్చువల్ ఫోరం విభాగం అధ్యక్షుడుగా శ్రీహరిపురం గ్రామానికి చెందిన ఎరుకలయ్యను నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. తనకీ పదవినిచ్చిన పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, దీనికి సహకరించిన మాజీ మంత్రి ఆర్కే రోజాకు రుణపడి ఉంటానని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఎరుకలయ్య తెలిపారు.

### ఈడిగ మద్యం షాపు దరఖాస్తులకు గడుపు పెంపు

**నగరి:** ప్రభుత్వం ఈడిగ కులస్తులకు కేటాయించిన మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడు చిత్తూరు జిల్లాకు చెందిన ఈడిగ కులస్తులే అయి వుండాలని, వారి కులం, ఉప కులం, జన్మ స్థలం సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరి స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని, ఏవైనా సందేహాలుంటే ఎక్సైజ్ సీఐ 9440902548, ఎస్ఐ 8985603531 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ నెల 10న ఉదయం 8 గంటలకు చిత్తూరు న్యూ కలెక్టరేట్ రెండవ ఫ్లోర్‌లోని డీఆర్‌డీఏ హాలులో లాటరీ పద్ధతిలో లబ్ధిదారును ఎంపిక చేయనున్నట్టు తెలియజేశారు.

## బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మ సునందనత

**కార్వేటినగరం:** గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరని కార్వేటినగరం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద అన్నారు. బుధవారం పద్మసరస్సు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై బాలింతలకు, గర్భవతులకు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ, రక్తహీనత రహిత సమాజ నిర్మాణానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని ఇస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే తీసుకునే ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని, ఆకు కూరలు రక్తహీనతను దూరం చేస్తాయన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు వయసుకు తగ్గ బరువు, ఎత్తు కలిగి ఉన్నారా, లేదా? అని నమోదు చేసి వారికి కూడా పౌష్టికాహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## ఊరగుట్ట భూములను పరిశీలించిన డీఆర్‌ఓ



మొగిలిలో ఊరగుట్ట భూములను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ

**బంగారుపాళెం:** మండలంలోని మొగిలి ఊరగుట్ట భూములను బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పరిశీలించారు. మొగిలి ఉరగుట్టలో యానాదులు గొర్రెలు, మేకలు, పశువులు మేపుకుంటూ కొంత స్థలాన్ని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ భూములపై గ్రామానికి చెందిన కొందరు కన్నుపడింది. అగ్ర కులస్తులు భూకబ్జాకు పాల్పడ్డారు. యానాదులు సాగు చేసుకుంటున్న భూములకు దొంగ పట్టాలను సైతం పొందారు. ఇది తెలుసుకున్న సీపీఎం నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలుమార్లు అధికారులు ఊరగుట్ట భూములను పరిశీలించారు. ఈ నేపథ్యంలో డీఆర్‌ఓ కూడా పరిశీలనకు వచ్చారు. ఊరగుట్ట ప్రాంతంలో గురుకుల పాఠశాలకు 5 ఎకరాలు, అర్హులైన యానాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డీఆర్‌ఓను కోరారు. అలాగే, అగ్రవర్ణాల వారు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, వీఆర్‌ఓ భవిత, యానాదుల సంఘ కార్యదర్శి నిర్మల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విదార్థులపై ప్రత్యేక దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న జయప్రకాష్ నాయుడు

**కార్వేటినగరం:** దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త జయప్రకాష్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులపై వివక్ష చూపకుండా వారిలో ప్రతిభను గుర్తించాలన్నారు. గఅలాగే పిల్లల శారీరక, మానసిక పరిస్థితుల వివరాలను సహిత ఉపాధ్యాయురాలు సింధుజను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయురాలు, రేఖ, సీఆర్పీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై నిరసన



బడ్జెట్ ప్రతులు దగ్ధం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**నగరి:** కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌ల కిందకు తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేస్తోందంటూ నిరసిస్తూ ఏఐటీయూసీ నాయకులు బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. బుధవారం ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వేలన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రంలో ఉన్న కోట్లాది మంది రైతులు, కార్మికులు, పేదలను ఆదుకునేలా ఏమాత్రమూ లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు కోడ్‌ల కిందకు తీసుకువచ్చిందని నిరసించారు. తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు ఢిల్లీలో పోరాటం చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. బడ్జెట్లో ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం కార్మికులకు సంబంధించి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే సబ్సిడీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో ఆటో టాక్సీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, బాషా, ఏఐటీయూసీ నాయకులు సతీష్, రమేష్, సత్తార్, ఏసుదాస్, చిరావుద్దీన్, చిన్న రాజ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి



మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

**పాలసముద్రం:** మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు కొందరు ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుని భోజనం చేయడం గమనించారు. దీనిపై ఆయన మధ్యాహ్న భోజన నిర్వాహకులను పైవిధంగా ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకునే పరిస్థితి రారాదని, అందరూ తినేలా వంటకాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మీనాక్షి, టీచర్లు ధనరాజ్, రమేష్ పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగు పరచండి



బట్టువారిపల్లె దళితవాడలో పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**పెనుమూరు(కార్వేటినగరం):** గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని కార్యదర్శులను పెనుమూరు ఎంపీడీఓ ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని సామిరెడ్డిపల్లె పంచాయతీ బట్టువారిపల్లె దళితవాడను, గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. చిన్నారులు, బాలింతలు, గర్భవతులకు పోషకాహారాన్ని క్రమం తప్పకుండా పంపిణీ చేయాలన్నారు. అనంతరం మురుగు కాలువలను పరిశీలించి పైవిధంగా పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే సాతంబాకంలో వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీతో వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించాలన్నారు. అలాగే గుత్తావాండ్ల ఊరు గ్రామ పంచాయతీలో క్యాటిల్ షెడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, మనోరంజని, ఏపీఓ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులే రచయితలుగా మాసపత్రిక భేష్..!

- మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మంగళ విద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్:** జిల్లాలోని బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నిర్వహిస్తున్న మంగళ విద్యావాణి సంచిక విద్యార్థులకు ఉపయోగకరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం మంగళ విద్యావాణి 33వ సంచికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థులే రచయితలుగా వ్యవహరిస్తూ మాసపత్రిక నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి మాసపత్రికలు నిర్వహించడం హర్షణీయమన్నారు. మాసపత్రిక నిర్వహణకు తమ వంతు సహాయం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులందరూ సమష్టి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్.అరుణ శివప్రసాద్, విద్యార్థులు హేమ, లహరి, పునీత, టీచర్లు పిల్లారప్ప, భారతి, సంపంగి తదితరులు పాల్గొన్నారు.

### పేయ దూడల ప్రదర్శన

**గుడిపాల:** మండలంలోని పిళ్లారికుప్పంలో బుధవారం సంకరజాతి పేయదూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయమోహన్ మాట్లాడారు.జెర్సీ జాతి ఆవులతో పాల దిగుబడి పెరగడమే కాకుండా పాల రేటు కూడా అధికంగా పొందవచ్చన్నారు. దీంతో పాటు ఇక్కడి వాతావరణానికి జెర్సీ ఆవులు అనుకూలంగా ఉంటాయన్నారు. హెచ్ఎఫ్ ఆవులు వేసవి తాపాన్ని తట్టుకోలేవని, అందువల్ల పాలరేటు కూడా సరిగ్గా రాదన్నారు. ప్రదర్శనకు తీసుకువచ్చిన 45 దూడలను పరిశీలించి ముగ్గురికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రవితేజ, సాయిసుధ, పీటీపీ డాక్టర్ ఆదిత్య, సిబ్బంది శివ, అబ్దుల్లా, జ్యోత్స్న, కన్నయ్య, కిషోర్, ఆర్ముగం పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే



ఎస్‌బీఆర్ పురం అంగన్‌వాడీ సెంటర్‌లో..

**నగరి:** ప్రతి నెలా పిల్లల పెరుగుదలను పరిశీలించి లెక్కిస్తున్నట్టు సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య సంరక్షణ, విద్యా దినోత్సవం (ఈసీసీఈ డే) నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి నెల 5వ తేదీన అంగన్‌వాడీ సెంటర్లలో ఈసీసీఈ డే నిర్వహిస్తామన్నారు. ఆ నెలలో పిల్లల పెరుగుదలను పరిశీలించి, వారి బరువు లెక్కించి వారి ఆరోగ్య సంరక్షణకు సలహాలు–సూచనలు ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దేవి, సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎస్‌కేలు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

**మాధవరంలో..**

**విజయపురం:** మండలంలోని మాధవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పూర్వ బాల్యదశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ కృష్ణవేణి మాట్లాడుతూ, 2030 సంవత్సరం నాటికి దేశవ్యాప్తంగా నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ అందరికీ సాధ్యమైనంత తొందరగా అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. అన్ని అభివృద్ధి క్షేత్రాలతో గరిష్ట ఫలితాలను సాధించడమే ఈసీసీఈ సమగ్ర లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులను ఆకర్షించేలా రకరకాల బొమ్మలు వస్తువులతో అలంకరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ఉమ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఎస్‌బీఆర్ పురంలో..**

**వడమాలపేట (విజయపురం):** వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం సూపర్‌వైజర్ రోజారమణి ఆధ్వర్యంలో ఈసీసీఈడే నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి, విజయపురం: అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఈసీసీఈ డే